క్లుప్తంగా...

ప్రజా సంక్షేమమే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలో ఇంటింటికీ మజ్లిస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మహిళలు తమ తమ ఫిర్యాదులను ఆయనకు విన్నవించారు. నల్లాలలో తాగునీరు సరిగా రావడం లేదని కొందరు ఫిర్యాదు చేయగా..మరికొందరు రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుందని ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత వారం కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగాయని దీన్ని వల్ల రోడ్లపై మురుగు నీరు ప్రవహించిందన్నారు. అయితే వెంట వెంటనే బల్దియా మాన్సూన్ టీమ్‌లు సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాయన్నారు.

స్పోర్ట్స్ అథారిటీలో అవకతవకలపై విచారణ జరపాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ తన అవినీతి బయటపడకుండా ఉండేందుకు సెలవురోజు కార్యాలయంలోకి చొరబడి అతని ఫైల్స్ తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాడని తెలంగాణ కోచెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఎల్బీస్టేడియంలో అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్‌తో ఆయన వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ..16 ఏళ్లుగా కోచ్‌ల నియామకం జరగకుండా అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ నెల 31న పదవీ విరమణ తీసుకోబోతూ సెలవురోజు అయిన సోమవారం కార్యాలయానికి రావడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనపై స్పోర్ట్స్ అథారిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ఎల్బీస్టేడియానికి మీడియా ప్రతినిధులు రావడంతో స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం వెనుక గేటు నుంచి కొన్ని ఫైల్స్ తీసుకొని అశోక్‌కుమార్ వెళ్లిపోయారు.

దుర్గానగర్‌లో కరాటే స్టేట్ సెలక్షన్స్


గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులతో బాలాజీ

జియాగూడ: రాయిపూర్‌లో ఆగస్టు 17 నుంచి 20 వరకు జరిగే 33వ ఏఐకెఎఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్–2025 పోటీలకు తెలంగాణ నుంచి 18 మంది పలు స్కూళ్లకు చెందిన కరాటే విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించిన వారు పోటీల్లో పాల్గొంటున్నట్లు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఏఐకెఎఫ్ సహ కోశాధికారి ముల్తాంకార్ శ్రీబాలాజీ అన్నారు. సోమవారం దుర్గానగర్‌లోని భారత అభ్యుదయ శిక్షాసమితి ఏకె భవన్‌లో 11వ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కరాటే డో చాంపియన్‌షిప్, స్టేట్ సెలక్షన్స్ జరిగాయి. ఆల్ ఇండియా కరాటే డో ఫెడరేషన్ ఆదేశాల మేరకు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గ్రేటర్‌తో పాటు మెదక్, మేడ్చల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 100 మందికి పైగా పాల్గొన్నారు. ఇందులో 18 మంది కరాటే క్రీడాకారులు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్‌లు సాధించారు. ముల్తాంకార్ శ్రీబాలాజీ మాట్లాడుతూ..ఈ పోటీల్లో జియాగూడకు చెందిన స్కూల్‌లతో పాటు రాష్ట్రంలోని వివిధ స్కూల్స్ కరాటే విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే తెలంగాణ స్పోర్ట్స్ అధ్యక్షులు కె.కమల్‌ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రమోద్ పాల్గొన్నారు.

హెచ్‌డీఆర్‌ఎస్‌ఎంఏ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా అలీఖాన్



గోల్కొండ: గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. సోమవారం టోలిచౌకీ డిలక్స్ కాలనీలో వీనస్ హైస్కూల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కటా సునీల్, కోశాధికారిగా కె.రామచంద్రయ్య ఎన్నికయ్యారు.


సింహాల రథానికి స్వాగతం పలుకుతున్న అంజన్‌కుమార్ యాదవ్, దిదిగే జయంత్


భారతమాత, కోట మైసమ్మ అమ్మవారి ఘటం ఊరేగింపులో కమిటీ ప్రతినిధులు


గజానన వ్యాయామశాల అమ్మవారి ఘటోత్సవంలో ఆలయ ప్రతినిధి దినేష్, సభ్యులు

ఘనం.. ఘటోత్సవం

చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం అమ్మవారి ఘటాల, తొట్టెల, పలహారం బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. ఊరేగింపులో ఆయా ఆలయాలకు చెందిన ఆలయ నిర్వాహకులు, భక్తులు సందడి చేశారు. డప్పు చప్పుళ్లు, బ్యాండ్ మేళాలు, మంగళవాయిద్యాలతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు దారిపొడవునా ఆకట్టుకున్నారు. అమ్మవారి ఘటాలకు అధికారులు, ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



చార్మినార్: పాతబస్తీలో సోమవారం రాత్రి మాతేశ్వరీ ఘటాల సామూహిక ఊరేగింపు కన్నుల పండువగా ప్రశాంతంగా కొనసాగింది. వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి ఘటాల పరిసమాప్తి ఊరేగింపులో ఆయా ఆలయాలకు చెందిన ఉత్సవాల నిర్వాహకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- ఈసారి ఊరేగింపు బయలు దేరడానికి ఆలస్యమైంది.
- ఎప్పుడో చార్మినార్‌కు చేరుకున్న భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఊరట కలిగించాయి. సాంస్కృతిక కార్యక్రమాలు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగాయి.

సైడ్ లైట్స్

- ప్రధాన ఆలయాల వద్ద భవిష్యవాణి (రంగం) కార్యక్రమం అనంతరం దేవీ ఘటాలను భారీ ఊరేగింపు నిర్వహించారు.
- అక్కన్న మాదన్న అమ్మవారి ఘటం అంబారీపై చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం ద్వారా ముందుకు వెళ్లింది.
- మీరాలంమండి ఆలయం ఘటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
- మీర్‌చౌక్ రోడ్డు, ఎతేబార్‌చౌక్, కోట్ల అలీజా, ఈస్ట్ చార్మినార్, సర్దార్ మహల్, టెలిఫోన్ భవన్‌ల ద్వారా మీరాలంమండి ఊరేగింపు కొనసాగింది.
- అలంకార బ్రహ్మ, బాలాజీ మందిర్ ప్రధాన అర్చకులు ఆత్రేయాచార్య ఈస్ట్ చార్మినార్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాల స్వాగత వేదిక భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.
- లాల్‌దర్వాజా మోడ్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు వివిధ స్వచ్ఛంద సంస్థలు, బస్తీ సంఘాలు, స్థానిక వాసులు స్వాగత వేదికలను ఏర్పాటు చేసి అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు.
- చార్మినార్ వద్ద నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- మాతేశ్వరీ ఘటాల ఊరేగింపు సందర్భంగా వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.
- నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పర్యవేక్షణలో దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రాతో కూడిన పోలీసు అధికారుల బృందం బందోబస్తును పర్యవేక్షించారు.
- భాగ్యనగర్ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో పలువురు అధికార, అనధికార ప్రముఖులు చార్మినార్ వద్ద అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు.




కాళికాదేవీ రూపంలో అమ్మవారి విగ్రహం


అంబారిపై మీరాలంమండి అమ్మవారు


జగదాంబ ఆలయం అమ్మవారి ఘటానికి పూజలు


మీరాలంమండి శకటం


గౌలిగూడలో భవిష్యవాణి నిర్వహిస్తున్న దృశ్యం


గౌలిపురా నల్ల పోచమ్మ ఘటం ఊరేగింపులో ఆదర్శ మహేశ్ తదితరులు


ఊరేగింపులో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి


కసరట్ట అమ్మవారి ఘటానికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


దర్బార్ మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సన్మానిస్తున్న చైర్మన్ అమర్‌సింగ్


నల్లపోచమ్మకు బంగారు బోనం సమర్పిస్తున్న సాయిబాబాచారి తదితరులు


పటేల్‌నగర్ మైసమ్మ ఆలయంలో.. టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా


గోషామహల్‌లో.. బీఆర్‌ఎస్ నాయకురాలు శాంతిదేవి తదితరులు


బేగంబజార్ ఫిష్ మార్కెట్ అమ్మవారి ఆలయంలో.. విజయ్‌కుమార్ చౌదరి, బజ్జిగోప్ యాదవ్


వేడుకల్లో టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్


సబ్జిమండి తొట్టెల, ఘటాల ఊరేగింపులో సంఘ్ సేవక్ రాజేందర్ పర్షాద్ జైస్వాల్ తదితరులు


భీమ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ తొట్టెల ఊరేగింపులో నరహరిచారి, హేమంత్‌రాజ్


సీతారాంపేట్ మాతేశ్వరీ పలహారం బండి ఊరేగింపులో ధన్నారం నరహరి తదితరులు


హనుమాన్‌టేక్డిలో..మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా


పటేల్‌నగర్ రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఘటం ఊరేగింపులో కమిటీ ప్రతినిధులు


పలహారం బండి ఊరేగింపులో తూముకుంట అరుణ్ కుమార్, ఒగ్గు శివరామకృష్ణ, ఒగ్గు ప్రత్యూష, ఒగ్గు ఉజ్వల్


శివసాయినగర్‌లో..





సుల్తాన్‌బజార్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు నాలుగు రోజుల నుంచి డే టైమ్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నామని ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు ఆధ్వర్యంలో కోఠి రంగ్‌మహాల్ చౌరస్తా వద్ద సడన్‌గా మధ్యాహ్నం డంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో ఒకరోజు 12 మంది, మరో రోజు 6 మంది పట్టుబడ్డారని తెలిపారు. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాములు, ఏసీపీ ఎ.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మధుబాల

సంతోష్‌నగర్: మిధాని ఫైనాన్స్ డైరెక్టర్‌గా మధుబాల కల్లూరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మిధానిలో ఫైనాన్స్ జనరల్ మేనేజర్‌గా సేవలందించిన మధుబాలను ఫైనాన్స్ డైరెక్టర్ నియమించారు. 2020 మే 31 నుంచి 2020 అక్టోబర్ 26 వరకు మిధాని తాత్కాలికంగా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఫైనాన్స్ విభాగానికి నాయకత్వం వహిస్తూ కంపెనీ విధానాలు, ఆర్థిక నిబంధనల రూపకల్పనలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారు. అంతర్గత ఆర్థిక నియంత్రణల అమలలో కూడా సంస్థ పటిష్ఠంగా ఉండేలా ఆమె కృషి చేశారు. అంతేకాకుండా బోర్డు స్థాయి రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా కూడా సేవలందించారు.

‘విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం’


అధికారులతో సమావేశమైన మెట్రో జోన్ సీజీఎం సాయిబాబా

చార్మినార్: బోనాల ఉత్సవాలకు ఎక్కడ ఎలాంటి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ మెట్రో జోన్ సీజీఎం సాయిబాబా తెలిపారు. సోమవారం చార్మినార్ ప్రధాన వీధుల్లో నిర్వహించిన అమ్మవారి ఘటాల పరిసమాప్తి సామూహిక ఊరేగింపు సందర్భంగా ఆయన పాతబస్తీలో విద్యుత్ సరఫరాను పరిశీలించారు. టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ సోమిరెడ్డి, చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్, చార్మినార్ ఏడీఈ మక్బూల్‌లతో కలిసి విద్యుత్ సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తమ సిబ్బంది 24/7 పని చేయడంతో నిరంతర విద్యుత్ సరఫరా జరిగిందన్నారు.

బోనాలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు


మధుసూదన్ గౌడ్

చార్మినార్: బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి సహకరించిన అధికార, అనధికార ప్రముఖులందరికీ ధన్యవాదాలని ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ అన్నారు. తమ ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధుల సహాయ సహకారాలతోనే ఆనందోత్సాహాల నడుమ బోనాల జాతర ఉత్సవాలను పూర్తి చేశామని..వీరందరికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.